క్లుప్తంగా

భూమి సమస్యల పరిష్కారానికి రీసర్వే



పెడన: భూమి సమస్యల పరిష్కారినికి చేపట్టిన రీసర్వే ప్రాజెక్టుకు గ్రామస్తులు పూర్తి సహాయ సహకారాలను అందించాలని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని శేరివత్తర్లపల్లి(ఎస్వీపల్లి)లో రీసర్వేపై గ్రామ సభ నిర్వహించడంతో పాటు అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభలో తహసీల్దారు మాట్లాడుతూ.. గ్రామ పరిధిలో మొత్తం 789.13 ఎకరాల భూమికి 257 సర్వే నంబర్లు ఉన్నాయని అన్నారు. వీటన్నిటికీ రీసర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రీసర్వే చేయడానికి ఐదు బృందాలు పనిచేస్తాయని.. ఆయా బృందాలకు గ్రామస్తులు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అర్జావెంకట నగేష్, టీడీపీ మండల కార్యదర్శి శీరం ప్రసాద్, రీసర్వే డీటీ సల్మా, మండల సర్వేయర్ ప్రభు, సచివాలయాల సర్వే కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



చల్లపల్లి: కొనసాగుతున్న దసరా ఊరేగింపు కార్యక్రమాల్లో ముందస్తు అనుమతులు లేకుండా ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని చల్లపల్లి ఎస్ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఊరేగింపునకు అనుమతి తీసుకుని మైకులు, డీజేలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. పలు చోట్ల పరిమితికి మించి డీజేలు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. డీజేల పేరుతో అలజడి సృష్టిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. మండల పరిధిలోని యార్లగడ్డలో నిబంధలను అతిక్రమించి డీజేలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు, డీజే యజమానులు, అందుకు ఉపయోగించిన ట్రాక్టర్ వారిపై కేసు నమోదు చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలందరూ పోలీసు వారికి సహకరించాలని ఎస్ఐ సుబ్రహ్మణ్యం కోరారు.

స్వచ్ఛ చల్లపల్లికి విరాళం



చల్లపల్లి: స్థానిక సామాజిక కమ్యూనిటీ ఆసుపత్రి(సీహెచ్‌సీ) డైరెక్టర్ వరదా హరిగోపాలు స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమాలకు రూ.10 వేల విరాళాన్ని స్వచ్ఛ చల్లపల్లి నిర్వాహకులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్‌కు సోమవారం అందజేశారు. తన తండ్రి వరదా రామారావు ఆరో వర్ధంతి సందన్బంగా విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత చెక్కును 'మన కోసం మనం ట్రస్టు'కు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతిభా పురస్కారం అందజేత



నాగాయలంక: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ బయోలజీ ఉపాధ్యాయుడు డాక్టర్ కొమ్మినేని ఉదయకుమార్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారం పొందారు. కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం రాత్రి నిర్వహించిన వేడుకలో ఉదయకుమార్ ఉన్నత విద్యామండలి వైస్.చైర్మన్ ఆచార్య కె.రత్నషీలా మణి, ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి, మాజీ ఎమ్మెల్సీ, ట్రస్టు అధ్యక్షుడు కె.ఎస్.లక్ష్మణరావు తదితర ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. స్థానిక ఎంఈవో అన్నపరెడ్డి రామారావు, హెచ్.ఎం అలపర్తి సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయ కుటుంబం పురస్కారం పొందిన ఉదయకుమార్‌ను సోమవారం అభినందించారు.

బదిలీ కానిస్టేబుళ్లకు సత్కారం



చల్లపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించి బదిలీపై మచిలీపట్నం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వెళుతున్న కానిస్టేబుళ్లు బొల్లా శ్రీనివాసరావు, చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అవుతున్న బీవీఎస్ఈ ప్రసాద్‌లను ఎస్ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వీరికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

జీఎస్టీ సంస్కరణలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఏసు రత్నం



జీఎస్టీ సంస్కరణలపై పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ సంస్కరణలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి డి.ఏసురత్నం అన్నారు. ఆరోగ్య బీమాలో సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని ఫైర్ స్టేషన్ ఆవరణలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజల అవసరాలకు సంబంధించి ఎన్నో వస్తువులపై ధరలు తగ్గడంతో పాటు ఆరోగ్య బీమాలో జీఎస్టీ పూర్తిగా మినహాయింపు చేయడం ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఈ తగ్గింపు వల్ల పొదుపు మరింత పెంచుకోవచ్చునని ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి జె.ఆంజనేయులు, జీఎస్టీ ఆర్గనైజర్ పి.జకరయ్య, జిల్లాలోని ఆయా స్టేషన్ల అగ్నిమాపకశాఖాధికారులు రవితేజ, ఎస్.సుధాకర్, ఎ.వెంకటేశ్వరరావు, జి.రామ్మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా రంగంపై జీఎస్టీ మినహాయింపు హర్షణీయం..

మచిలీపట్నం అర్బన్: విద్యా రంగంలో పలు రకాల వస్తువులపై జీఎస్టీ పూర్తిగా తొలగించడం హర్షణీయమని రాష్ట్ర పన్నుల శాఖ కృష్ణా జిల్లా సహాయ కమిషనర్ ఎం.సౌమ్య తెలిపారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా స్థానిక లేడీ యాంప్థిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గతంలో ఐదు రకాల పన్ను స్లాబులు అమలు చేస్తుండగా, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం వాటిని రెండు ప్రధాన స్లాబులకే పరిమితం చేయడం ప్రజలకు గణనీయమైన ఆదా కలిగించిందన్నారు. డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ స్వరూపరాణి మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే పన్ను అనే నూతన జీఎస్టీ సంస్కరణలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు నిజమైన పండుగగా నిలుస్తున్నాయన్నారు. అవగాహన సదస్సు అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ నినాదాలతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మి, జీఎస్టీవో అబ్దుల్ సలాం, సర్దార్ పాషా, అధ్యాపకులు లంకిశెట్టి హరినాథ్ బాబు, మమత, మున్వర్, సురేష్, శ్రీనివాస్, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

సేవా సంస్థల ప్రోత్సాహాన్ని వినియోగించుకోవాలి



ఫీడ్ మేకింగ్ యూనిట్ ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

నాగాయలంక: నాబార్డ్ అండతో మచిలీపట్నానికి చెందిన ఎన్‌జీవో ప్రజా ప్రగతి సేవా సంఘం(పీపీఎస్ఎస్) ఆధ్వర్యంలో సోమవారం నాగాయలంక మండలం నాలి గ్రామంలో ఎస్టీ(యానాదులు) మహిళల కోసం రూ.15 లక్షలతో నిర్మించిన ఆక్వా ఫీడ్ మేకింగ్ యూనిట్‌ను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం ప్రారంభించారు. మండలంలోని నాగాయలంక, మర్రిపాలెం, తలగడదీవి, కమ్మనమోలు, సంగమేశ్వరం, భావదేవరపల్లి గ్రామాలకు చెందిన ఎస్టీ మహిళల ఆర్థికాభ్యున్నతి కోసం నాబార్డు డీడీఎఫ్ ప్రాజెక్టు ఆర్థిక సహకారంతో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలకు ఈ సందర్భంగా బుద్ధ శ్రీకారం చుట్టారు. సంస్థ అధ్యక్షుడు పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సేవా సంస్థల ద్వారా అందుకుంటున్న ప్రోత్సాహాన్ని యానాదులు సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాల్లో ఆర్థికంగా స్థిరపడాలని తెలిపారు. ఈ సందర్భంగా పీపీఎస్ఎస్ నేతృత్వంలో ఒక్కోటి రూ.1 లక్ష వ్యయంతో మూడు పీతల పెంపకం యూనిట్‌లు మంజూరు చేశారు. రూ.15 లక్షలతో 25 కుటుంబాలకు అయిదు ఫైబర్ బోట్లు అందించారు. సొర్లగొందిలో మత్స్యకారులకు రూ.10 లక్షలతో 10 ఎకరాల్లో పీతల సాగు కోసం చెరువులు తవ్వించే ఏర్పాటు చేశారు. నాలి గ్రామంలో మత్స్యకారులకు 40 ఎకరాల్లో పీతల సాగు చెరువులకు రూ.40 లక్షలు కేటాయించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాయుడు బాలకృష్ణ, మండలి ఉదయ భాస్కర్, ఎంపీటీసీ ధనుంజయ్, ఏఎంసీ డైరెక్టర్‌లు ఉప్పల ప్రసాద్, మంగళగిరి శ్రీనివాసరావు, ఎఫ్‌డీవో వేదమణి, పీపీఎస్ఎస్ కోఆర్డినేటర్ నక్కా విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

దిలీప్‌కుమార్‌కు ఆదర్శ అధ్యాపక పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న దిలీప్‌కుమార్

పెడన: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థి వికాస వాహిని సంస్థ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని మహతి కళావేదికపై ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో పెడన కళాంజలి హైస్కూలు అధినేత కోలవెన్ను దిలిప్‌కుమార్ ఆదర్శ అధ్యాపక పురస్కారాన్ని అందుకున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి విద్యా వికాస వాహిని వ్యవస్థాపక అధ్యక్షుడు వేములపల్లి కేశవరావు అధ్యక్షత వహించారు. శతాధిక గ్రంథకర్త జీవీ పూర్ణచందు, తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, చెన్నై విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కావూరి సూర్యప్రకాశరావు, వేములపల్లి విజయ్, భవిష్య, మర్రి శ్రావణి తదితరుల చేతుల మీదుగా దిలీప్‌కుమార్ సత్కారాన్ని, పురస్కారాన్ని స్వీకరించారు. విద్యారంగంలో 25 ఏళ్లుగా కృషి చేసినందుకు ఈ పురస్కారం తనకు అందిందని దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, తోటి ఉపాధ్యాయులు, కళాంజలి ఉపాధ్యాయ సిబ్బంది, ఆప్త నాయకులు ఆయనను అభినందించారు.

చల్లపల్లికి స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్ర స్థాయి అవార్డు



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ కృష్ణకుమారి, ఈవో మాధవేంద్రరావు



అవార్డు అందుకుంటున్న డీఆర్‌కే ప్రసాద్, పద్మావతి దంపతులు

చల్లపల్లి: స్వచ్ఛ ఆంధ్ర-2025 రాష్ట్ర స్థాయి అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా చల్లపల్లి గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి పేర్ని వెంకట మాధవేంద్రరావులు సోమవారం అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల్లో ప్రామాణికంగా సూచించిన 8 అంశాల్లో ముందంజలో ఉండడంతో చల్లపల్లి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైంది. కాగా విజయవాడలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ సభలో ముఖ్యమంత్రి చేతులు మీదుగా వీరు అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి అరుణ ఉన్నారు.

'మన కోసం మనం ట్రస్టు'కు జిల్లా స్థాయి అవార్డు

చల్లపల్లి: ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు గానూ స్వచ్ఛ సుందర చల్లపల్లికి చెందిన మన కోసం మనం ట్రస్టుకు జిల్లా స్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర-2025 అవార్డు లభించింది. ఈ సందర్భంగా సోమవారం మచిలీపట్నంలో ఏర్పాటుచేసిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రులు వాసంశెట్టి సుభాష్, ఆర్టీసి చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా స్వచ్ఛ చల్లపల్లి రథసారధులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు అవార్డును అందుకున్నారు. గ్రామాన్ని సుందరంగా ఉంచడం కోసం ఏర్పాటుచేసిన మన కోసం మనం ట్రస్టుకు అవార్డు లభించడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉత్తమ గ్రీన్ అంబాసిడర్‌గా రంగారావు



అవార్డు అందుకుంటున్న రంగారావు

పెడన: మండల పరిధిలోని నందమూరు గ్రామ పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్‌గా విధులు నిర్వహిస్తున్న ఊసల రంగారావు ఉత్తమ గ్రీన్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. సోమవారం మచిలీపట్నం జెడ్పీ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్-2025లో కృష్ణాజిల్లా స్థాయిలో గ్రీన్ అంబాసిడర్ రంగారావు ఆర్టీసీ రాష్ట్ర ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు చేతులు మీదుగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, డీపీవో జె.అరుణ, ఎంపీడీవో ఎ.అరుణకుమారి, డిప్యూటీ ఎంపీడీవో ఎం.నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మహర్షి వాల్మీకి జయంతి

చిలకలపూడి(మచిలీపట్నం): మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం నిర్వహించనున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ జిల్లా అధికారి జి.రమేష్ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర రావు తదితరులు హాజరవుతారన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారులతో పాటు బోయ, వాల్మీకి, కుల సంఘాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గూడూరు: మండల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ మచిలీపట్నం ఈఈ జి.గోవిందరావు సోమవారం తెలిపారు. ముక్కొల్లు, కలపటం, పినగూడూరులంక, గ్రామాలకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

కృత్తివెన్ను: మండలంలోని కృత్తివెన్ను, లక్ష్మీపురం సబ్‌స్టేషన్‌లలో 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు, ఆక్వా రైతులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పెరటికోళ్ల పెంపకంపై శిక్షణ



మోపిదేవి: నాటుకోడి గుడ్లల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, ప్రతి కుటుంబం పెరటి కోళ్ల పెంపకం చేపట్టాలని కేవీకే ఘంటశాల సమన్వయకర్త డాక్టర్ సుధారాణి తెలిపారు. మండల పరిధిలోని బోడగుంట గ్రామంలో పెరటికోళ్ల పెంపకంపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనుబంధ రంగాలలో తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ పోషక ఆహారాన్ని అందించే రంగం పెరటికోళ్ల పెంపకం అని తెలిపారు. మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ.. పెరటిలో పెంచుకోవడానికి అనువైన పెరటికోళ్ల కంటే అధిక ఉత్పాదకత శక్తి గల కోళ్ల రకాలను వివిధ పథకాల ద్వారా గ్రామీణ ప్రజలకు చేరువ చేయడానికి కేవీకే కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.వెంకటలక్ష్మీ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నేడు కృష్ణసాయి మందిరంలో మహా కుంభాభిషేకం

చల్లపల్లి: మండల పరిధిలోని పురిటిగడ్డలో గల శ్రీకృష్ణసాయి ధ్యాన మందిరం 12వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మహా కుంభాభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆయల నిర్వాహకులు, రిటైర్డ్ ఆర్టీవో నాదెళ్ల శివరామకృష్ణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7గంటలకు నిత్య మండపారాధనలు, నిత్య హోమాలు.. అనంతరం మహా కుంభాభిషేకము, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు వివరించారు. 11 గంటలకు బాబావారికి అన్నాభిషేకరం 12 గంటల నుంచి భక్తులకు అన్నసమారాధన నిర్వహించిన్నట్లు ఆయన తెలిపారు.

డ్రైనేజీలో పూడిక తీత

సాక్షి ఎఫెక్ట్



పూడిక తీస్తున్న పంచాయతీ సిబ్బంది

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో ప్రధాన మురుగు కాలువలను పంచాయతీ అధికారులు సోమవారం బాగుచేయించారు. సాక్షి దినపత్రికలో 'ముందుకు కదలని మురుగు' శీర్షికతో 6వ తేదీన ప్రచురితమైన ప్రత్యేక కథనంపై అధికారులు స్పందించారు. పంచాయతీ సిబ్బందితో డ్రైనేజీలో పూడిక తీయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రారంభోత్సవ సభలో సమస్యల ఏకరువు!



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: మండల పరిధిలోని నందిగామ గ్రామంలో సోమవారం గ్రామ సచివాలయం, హెల్త్ వెల్‌నెస్ సెంటరు, వ్యవసాయ ఉత్పత్తి నిల్వ కేంద్రం నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మహిళలు తమ గ్రామంలోని సమస్యలను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ వద్ద ఏకరువు పెట్టారు. కొందరు లిఖితపూర్వకంగా వినతి పత్రాలను అందజేశారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన గ్రామ సచివాలయాన్ని రూ.43.60 లక్షలతో, రూ.23.94లక్షలతో రైతు ఉత్పత్తి నిల్వ కేంద్రం, రూ.20.80లక్షలతో హెల్త్ వెల్‌నెస్ సెంటరు, కాంపౌండ్ వాల్‌కు రూ.15 లక్షలతో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కింద నిర్మించారు. పంచాయతీ నిధులు రూ.4.15 లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. అనంతరం బయలుదేరే ముందు ఎమ్మెల్యేకు మహిళలు సమస్యలు తెలిపారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేదని, బస్సు ఏర్పాటు చేయాలన్నారు. అంతర్గత రోడ్లు లేవని.. ఎస్టీలకు శ్మశాన వాటిక లేదని పలువురు పేర్కొన్నారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, టీడీపీ మండల కార్యదర్శి శీరం ప్రసాద్, ఎంపీడీవో అరుణకుమారి, ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్, చేవేంద్ర పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్‌కుమార్, సర్పంచ్ బొడ్డు చినబాబు, ఉప సర్పంచ్ కాగిత లక్ష్మీ, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నిక ద్వారా చల్లపల్లి మసీదు కమిటీని ఏర్పాటుచేయాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ముస్లిం నాయకులు

చల్లపల్లి: స్థానిక మస్జిద్-ఏ మహమ్మదీయ మస్జిద్(పెద్ద మసీదు)కు ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్య బద్ధంగా పాలక పక్షాన్ని ఎన్నుకోవాలని కోరుతూ చల్లపల్లికి చెందిన పలువురు ముస్లిం సోదరులు సోమవారం కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. గత 20 ఏళ్లుగా మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ నసీం షెహరి ఎన్నికలు నిర్వహించకుండా ఆధ్యక్షునిగా కొనసాగుతున్నారని వారు ఆరోపించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా స్థానిక ముస్లింలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా రాజకీయ నాయకుల అండతో వక్ఫ్‌బోర్డు ఆఫీసుకు వెళ్లి కమిటీని రెన్యూవల్ చేయించుకుని ఎన్నికలు నిర్వహించకుండా పదవుల్లో కొనసాగుతున్నారని అన్నారు. ప్రస్తుత పాలక కమిటీ గడువు ముగిసినందున తాజాగా ఎన్నికలు నిర్వహించి కమిటీ సభ్యులను ఎన్నుకోవాలని పలువురు ముస్లిం నాయకుల కోరారు. సాధ్యమైనంత త్వరగా మసీదు నూతన పాలకవర్గాన్ని ఎన్నిక ద్వారా నియమించాలని కోరుతూ కలెక్టర్ డీకే బాలాజీకి ఫిర్యాదు చేశారు.

గౌరవంగా ఆమోదించండి

కలంకారి క్లస్టర్ భూబదాలయింపుపై ఎమ్మెల్యే కాగిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: కలంకారి క్లస్టర్ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని.. దానిని నిర్మించడానికి మున్సిపల్ పాలకవర్గం భూ బదలాయింపును వ్యతిరేకించడం చాలా బాధాకరమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక గూడూరు రోడ్డులోని దేవాంగ కల్యాణ మండపంలో పెడన కలంకారి ఆర్టిజెన్స్ అసోసియేషన్, ది పెడన కలంకారి ఆర్టిజెన్స్ వేల్ఫేర్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఉమ్మడి సమావేశాన్ని కలంకారి కార్మికులు, జాబ్‌వర్కర్లతో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కౌన్సిల్ అజెండాలో అంశాన్ని పెట్టి కౌన్సిల్ సభ్యులు తీర్మానించాల్సింది పోయి వ్యతిరేకించడం బాధగా ఉందన్నారు. ఇప్పటికైనా గౌరవంగా ఆమోదించి పంపిస్తే బాగుంటందన్నారు. సమావేశంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పెడన కలంకారి ఆర్టిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బళ్ల ప్రసాద్, కార్యదర్శి జంపాన శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కట్టా హేమసుందరమూర్తి, మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్‌ఖయ్యూం(హన్ను), కౌన్సిలర్లు మట్టా శివపావని, భళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఐసీడీఎస్ సీడీపీవో ప్రసన్న



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఘంటసాల: మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ మొవ్వ ప్రాజెక్ట్ సీడీపీవో ఎస్.ప్రసన్న విశ్వనాథ అన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల మండల స్థాయి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ఈ మాసోత్సవాల్లో పురుషులు సైతం భాగస్వామ్యం కావాలన్నారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ.. పిల్లల ఎదుగుదలకు తల్లి పాలతో పాటు పోషకాహారం తోడ్పడుతుందని వివరించారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి, ఆర్ఐ కె.శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీసీలు, శాస్త్రవేత్తలు, గ్రామ సర్పంచి బి.వెంకటేశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న నాయకులు

గూడూరు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను సోమవారం గూడూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రాముఖ్యతను నాయకులు వివరించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యులు వేముల సురేష్ రంగబాబు, డీసీ చైర్మన్ పోతన స్వామి, సర్పంచి లింగం సులోచనా రాణి, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

గుడివాడ టౌన్: వరి నాట్లు వేసి రెండు నెలలు పూర్తవుతున్న సందర్భంగా పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శొంఠి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుసంఘం బృందం గుడివాడ పరిసర ప్రాంతాల్లో పర్యటించామని తెలిపారు. పంట నమోదు ప్రక్రియ 60 శాతానికి మించలేదన్నారు. త్వరితగతిన రైతులు పంట నమోదు చేసుకోవాలని అందుకు వీఏఏలు సహకరించాలన్నారు. ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. 10 రోజులుగా ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో పలు రకాల పంటలకు సంబంధించి చీడ పీడలను రైతులు ఎదుర్కొంటున్నారన్నారు. వ్యవసాయాధికారులు క్లోరో 50, ఎంట్రాకాల్, క్లోరిపైరిపాస్, మోనో క్రోటోఫాస్ పురుగు మందులను సబ్సిడీపై అందజేయాలన్నారు. ఎలుకల నివారణ మందు కూడా రైతులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యుడు నీలం మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.